# రామగుండం మేయర్‌గా మహంకాళి స్వామి





# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 17 ఫిబ్రవరి , 2026 | పేజీలు :08


# గురుకులంలో నీటి కష్టాలు తీర్చండి



ఖాళీ బకిట్లతో రోడ్డెక్కిన విద్యార్థినులు

**ప్రజాపక్షం/తిర్యాణి :** తిర్యాణి మండల కేంద్రంలోని చెలిమల గిరిజన మహిళా గురుకుల పాఠశాల విద్యార్థినులు నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోడ్డెక్కారు. పాఠశాల నుంచి కొమరం భీమ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తమ గోడు వెళ్లబోసుకున్నారు. చాలా కాలంగా పాఠశాలలో తాగునీరు, వినియోగపు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతోనే ఆందోళనకు దిగామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, మరోవైపు మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు సకాలంలో అందకపోవడంతో నిర్వహణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీని ప్రభావం విద్యార్థులపై పడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గురుకులంలో నెలకొన్న నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

# పారిశుధ్య పనులు పక్కాగా పూర్తి చేయించాలి



ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజా పక్షం/ వేములవాడ:** మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ పట్టణంతోపాటు జాతర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పక్కాగా పూర్తి చేయించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడలోని శివార్చన స్టేజీ, ఇతర పరిసర ప్రాంతాల్లో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చెత్తాచెదారం నిలువ ఉండకుండా. ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. చెత్త తరలించే ట్రాక్టర్, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, నీటిని సరఫరా చేయాలని సూచించారు. భీమేశ్వర సదన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. శ్రీ భీమేశ్వరస్వామి, బద్ది పోచమ్మ, ప్రసాదం కౌంటర్లు ఇతర ప్రదేశాల్లో భక్తుల రద్దీని పరిశీలించి. అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో డీఆర్డీఓ గీత, మిషన్ భగీరథ ఈఈ అన్వర్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌లో సిపిఐ బలోపేతానికి కృషి



ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్పొరేషన్ లో నిరంతరం కృషి
సిపిఐ కార్పొరేటర్ సూర్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో వచ్చే కార్పొరేషన్ ఎన్నికల వరకు సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో 41 వ డివిజన్ లో కార్పొరేటర్ గా ఎన్నికైన సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ మార్కపూరి సూర్య సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రామగుండం నగర కార్పొరేషన్ గతంలో గ్రామ పంచాయతీ నుంచి నగర పాలక సంస్థ వరకు ఏర్పాటు జరిగినప్పటి నుంచి ప్రజా సమస్యల పై సిపిఐ పార్టీ మరియు ప్రజా సంఘాల తో కలిసి ప్రజా ఉద్యమాల్లో పాల్గొని అధికారం తో సంబంధం లేకుండా ప్రజల పక్షాన నిలబడిందని ఆయన అన్నారు. నేడు జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ పార్టీ నుంచి నల్గురు పార్టీ నాయకులను నిలబెట్టినప్పటికీని 41 వ డివిజన్ నుంచి మాజీ మేయర్ పైన సూర్య విజయం సాధించడం ద్వారా డివిజన్ ప్రజలకు, పార్టీ, ప్రజా సంఘాల కు గర్వ కారణమని ఆయన అన్నారు.కేవలం 41 వ డివిజన్ కు కాకుండా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ఉన్న ప్రజా సమస్యల ను కార్పొరేషన్ లో వినిపించే విధంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా కార్పొరేటర్ సూర్య మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు, పాలక పక్షం దృష్టి కి తీసికెళ్ళి కృషి చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశం అనంతరం కార్పొరేటర్ సూర్యను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అర్జీ వన్ బ్రాంచి పక్షాన మరియు పిట్ కమిటీల నాయకులు పూలమాలలు, పూల బోకేలు అందించి శాలువా లతో ఘనంగా సన్మానించారు. ఏఐటియుసి అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామిలు ప్రసంగించగా , బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సంకె అశోక్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, కోశాధికారి ఎస్ వెంకట్ రెడ్డి, ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తో పాటు బ్రాంచి ఆఫీస్ బేరర్స్,పిట్ కార్యదర్శులు ,సిపిఐ ప్రజా సంఘాల నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చాకే విజయోత్సవాలు




# కరీంనగర్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా



# సిరిసిల్ల మున్సిపల్‌పై బిఆర్ఎస్ జెండా

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ గా జిందం కల చక్రపాణి, వైస్ చైర్మన్ గా దార్ల సందీప్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సిరిసిల్ల పురపాలక సంఘ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టారు. సిరిసిల్ల మున్సిపల్ లో 39 కౌన్సిలర్ అభ్యర్థులకు గాను 27 బిఆర్ఎస్ కౌన్సిల్ సభ్యులు గెలుపొందడంతో చైర్మన్ పీఠానికి బలం చేకూరింది. సిరిసిల్ల మున్సిపల్ పై బి ఆర్ ఎస్ జెండాను ఎగరవేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడుగా, పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న జిందం కలచక్రపాణి మూడవ వార్డు కౌన్సిలర్ పోటీ చేసి గెలుపొంది రెండవసారి చైర్మన్ పదవి చేజెక్కించుకున్నారు. పార్టీ అధిష్టానం అన్ని విధాలుగా చర్చించి కేటీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా వీరు మద్దతు తెలిపిన కౌన్సిలర్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సిరిసిల్ల అభివృద్దే మరొకసారి బిఆర్ఎస్ కు పట్టం కట్టిందన్నారు. 39 వార్డ్ సభ్యుల సమన్వయంతో సిరిసిల్లను మరింత అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామన్నారు.

# హనుమాన్ దేవాలయంలో పూజా సామాగ్రి బహిరంగ వేలం

**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ మండలం అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయంలో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి, దీక్ష వస్త్రాలు అమ్ముకొనుటకు గాను ఫిబ్రవరి 19న టెండర్ కం బహిరంగవేల నిర్వహిస్తున్నట్లు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం ఒక సంవత్సరం కాలపరిమితి ఉంటుందని, దీనికి షెడ్యూలు ఖరీదు ఐదు వందలఅని డిపాజిట్ సొమ్ము ఏడు లక్షల రూపాయలని. ఈ నెల19న ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించబడుతుందని ఆలయ ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. మిగతా సమాచారం కొరకు కార్యాలయ నందు సంప్రదించాలని తెలిపారు.

# శివనామస్మరణతో మారుమోగిన గ్రామాలు

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల రూరల్ మండలంలోని పొలస గ్రామంలోనీ శ్రీ పొలస్తేశ్వర స్వామి,హబ్సీపూర్ గ్రామంలోని శ్రీ నాగముని లింగేశ్వర స్వామి ఆలయంలలో శివరాత్రి వేడుకలలో భాగంగా శివపార్వతుల రథోత్సవం సోమవారం ఎంతో వైభవంగా నిర్వహించారు.అధికసంఖ్యలో భక్తులు పాల్గొని రథోత్సవ కార్యక్రమాన్ని ఆ శివ పార్వతులను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.రథోత్సవ కార్యక్రమంలో మంగళవాయిద్యాలు మహిళలు, చిన్న పిల్లల నృత్యాలు చేస్తూ ఉత్సవ మూర్తులను రథంపై ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పొలస ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేందర్, ఆలయ చైర్మన్ భారతపు భూమన్న, సర్పంచులు మిల్కురీ శంకర్, ఇండ్ల జమున రాజేందర్, గ్రామ నాయకులు ముస్కు దామోదర్ రెడ్డి, రాజేందర్, పొలస ఆలయ ధర్మకర్తలు, ఆలయల కమిటీ సభ్యులు,అర్చకులు, సిబ్బంది, పోలాస, హబ్సీపూర్ గ్రామాల ప్రజలు,యువకులు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# సిఎం మొదలుపెట్టిన ఆటకు ముగింపునిస్తా

## కేంద్ర మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**"సీఎం రేవంత్‌రెడ్డి గారూ.. మెజారిటీ సీట్లను సాధించిన బిజెపికి మేయర్, డిప్యూటీ మేయర్ పదవి దక్కకుండా మంత్రులు, బిఆర్ఎస్, ఎంఐఎంతో కలిసి మీరు చేయని కుట్రలు లేవు.. అయినా బండి సంజయ్ రాజకీయం ముందు, బిజెపి సైనికుల పోరాట పటిమ ముందు మీ కుట్రలన్నీ పటాపంచలైనయ్.. క్రికెట్‌లో ఇండియాపై పాకిస్తాన్ ఘన విజయం సాధించినట్లుగానే కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల కబడ్డీ ఆటలో మీ అందరినీ ఓడించి బిజెపి కప్ గెలుచుకుంది. ఈ వేదికపై ఇప్పుడు చెబుతున్నా.. మీరు అనవసరంగా అప్రజాస్వామికంగా నన్ను కెలికి ఆట మొదలుపెట్టారు. ఇక మీ ఆటకు నేను ముగింపు ఇస్తా" అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి అల్టిమేటం ఇచ్చారు. సోమవారం కరీంనగర్‌లో మున్సిపల్ కార్పోరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం నూతనంగా ఎన్నికైన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, బిజెపి కార్పోరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటై ఫాంహౌజ్ వేదికగా కుట్రలు చేశారన్నారు. కాంగ్రెస్‌కు మ్యాజిక్ ఫిగర్ దాటకున్నా బిజెపిని అడ్డుకునే ప్రయత్నం చేయడంలో కాంగ్రెస్ పన్నిన చీకటి ఒప్పందాలేమిటని ప్రశ్నించారు. కరీంనగర్ కార్పోరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేయాలన్న ఎన్నో కలను సాకారమవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలన్నా, తెలంగాణ వచ్చనా కరీంనగర్ వేదికగా మార్పు మొదలైందన్నారు. అందులో భాగంగా కరీంనగర్ మేయర్ పదవిని బిజెపి కైవసం చేసుకుంటే రాష్ట్రంలోనూ బిజెపి అధికారంలోకి రావడం తథ్యమనే భయంతో కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ ఒక్కటై కుట్ర చేశాయన్నారు. ప్రజల సహకారం, అమ్మవారి ఆశీస్సులతో ఆ కుట్రలన్నీ భగ్నం చేశామన్నారు. కేంద్రం నుంచి అత్యధిక నిధుల తీసుకువచ్చి అశభివృద్ధి చేసేందుకు యత్నిస్తానన్నారు. బిఆర్ఎస్ కార్పోరేటర్లు ప్రజాస్వామ్య తీర్పును శిరసావహించాలనే ఉద్దేశంతో పార్టీ తీసుకున్న నిర్ణయం గొప్ప విషయమని అభినందించారు.

# హుజురాబాద్ మున్సిపల్ పీఠంపై ఎగిరిన కాంగ్రెస్ జెండా



**ప్రజాపక్షం / హుజురాబాద్ :**హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా ఎగురవేసింది. కొన్ని దశాబ్దాల తరువాత కాంగ్రెస్ పార్టీకి విజయ తిలకాన్ని దిద్దారు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్ ఎన్నికలు ప్రారంభమైన నాటి నుండి అభ్యర్థుల ఎంపికలో ఆచూతూచీ వ్యవహరిస్తూ, ఈ సారి ఎలాగైనా హుజురాబాద్‌లో జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉండి విజయ యాత్రను కొనసాగించారు. సోమవారం నాడు హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చైర్మన్‌గా రొంటాల సుహాసిని, వైస్ చైర్మన్‌గా గూడూరి అంజలి ఎన్నికైయ్యారు. అనంతరం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేనవీన్ యాదవ్, ప్రణవ్ ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు దగ్గరై ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసిందని, ఇకపై హుజురాబాద్‌లో ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని వారు అన్నారు.

సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటైనా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆపలేకపోయారని, ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సొంతంగానే జెండా ఎగురవేసినట్లు, వచ్చే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో ఇదే విజయం పునరావృతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ శ్రేణుల భారీగా హాజరయ్యారు.

# వేములవాడ మున్సిపల్ కాంగ్రెస్ కైవసం

## మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్ ఎన్నిక



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్ ఎన్నికయ్యారు. సోమవారం ప్రమాణ స్వీకారం అనంతరం భీమేశ్వర స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ ప్రజలను ఉద్దేశించి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో గతంలో ఒక కౌన్సిలర్ నేడు మున్సిపల్ పీఠం కైవశం చేసుకున్నాము. మొన్నటి ఎన్నికలో గత ప్రభుత్వం చేయని పనులు మేము రెండు సంవత్సరాలలో పూర్తి చేసిన పనుల గురించి చెప్తూ ఓటు అడిగాం.వేములవాడ పట్టణ ప్రజలు మేము చేస్తున్న అభివృద్ధి పనులను చూసి మాకు పట్టం కట్టారు.గత ప్రభుత్వంలో వేములవాడ వెనక్కి నెట్టి వేయబడింది.

**మమ్మల్ని ఆశీర్వదించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు...**

మేము గత రెండు సంవత్సరాలలో చేస్తున్న పనులకు ఇది పాస్ మార్కులు ఇచ్చినట్లు అయ్యింది.మాపైన బాధ్యత ఇంకా పెరిగింది.ప్రజలు మా పైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయయం.ఎన్నికల సమయంలో మా అభ్యర్థులు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం.పట్టణాన్ని అన్ని రంగాల్లో అబివృద్ధి చేస్తాం.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి దిశగా ముందుకు పోతుంది.గతంలో ఏకైక కౌన్సిలర్ నుండి నేడు మున్సిపల్ పీఠం కైవశం చేసుకున్నాము. వేములవాడ పట్టణ ప్రజలు విజ్ఞులు, పట్టణ అభివృద్ధి కోరుకున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రులు సహకారంతో ముందుకు వెళ్తున్నాం.వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం సంతోషం. పట్టణ ప్రజల కోసం, ప్రాంతం కోసం ఇచ్చిన హామీలు తప్పకుండా అమలు చేస్తాం.ప్రజలకు అండగా నిలబడతాం. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ పట్టణ ప్రజలు మాపై పెట్టిన నమ్మకానికి నిరంతరం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

# కోరుట్ల మున్సిపల్ కాంగ్రెస్ కైవసం





**ప్రజాపక్షం/ కోరుట్ల :** కోరుట్ల మున్సిపల్ రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.మున్సిపాల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో కాంగ్రెస్ అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యతతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకున్నారు.కోరుట్ల మున్సిపాలిటీలో 33 వార్డులకు గాను ఇటీవల జరిగిన ఎన్నికల్లో 18 స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా అవతరించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మెజారిటీ కౌన్సిలర్ల మద్దతుతో పాటు ఒక స్వతంత్ర అభ్యర్థి కూడా మద్దతు ప్రకటించారు.కోరుట్ల మున్సిపల్ చైర్మన్‌గా తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్‌గా మొహమ్మద్ షహెద్ ఉల్ అహద్ ఎన్నికయ్యారు. రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఈ ఎన్నిక అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందడానికి జువ్వాడి నరసింగరావు ఈరోజు ఒక సామాన్యమైన కార్యకర్తకు మున్సిపల్ పీఠాన్ని దక్కించారు. కాంగ్రెస్ పార్టీ నిజమైన కార్యకర్తలకు అండగా ఉంటుందని నిరూపించారు.ఈ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన ఓటింగ్ ప్రక్రియలో కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు.కాంగ్రెస్ అభ్యర్థుల విజయం ఖరారు కావడంతో మున్సిపల్ కార్యాలయం వెలుపల పండగ వాతావరణం నెలకొంది పార్టీ కార్యకర్తలు తపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతన మున్సిపల్ చైర్మన్‌గా తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్‌గా మొహమ్మద్ షహెద్ ఉల్ అహద్ మాట్లాడుతూ కోరుట్ల పట్టణ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

# అంగరంగ వైభవంగా రథోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం /గొల్లపల్లి :** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాపల్లి ,లోత్తునూరు గ్రామాలతో పాటు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన శివపార్వతుల రథోత్సవం భక్తులకు కనుల పండుగగా నిలిచింది. ఉత్సవాల ఆఖరి ఘట్టమైన రథోత్సవాన్ని వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో వీక్షించారు.ఆదివారం ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం,అభిషేకం,స్వామివారికి బిల్వార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివారి దర్శనం అనంతరం మంగళవాయిద్యాల నడుమ రాజరాజేశ్వర స్వామి విగ్రహ ఉత్సవ మూర్తులను రథంపై ఊరేగింపు నిర్వహించారు .శివ దీక్ష స్వాములు మహిళలు భక్తి పాటలతో భక్తులతో కలిసి నృత్యాలు చేస్తూ రథాన్ని లాగుతూ ముందుకు సాగారు . ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మెన్ రేగొండ సత్యనారాయణ,గ్రామ సర్పంచ్ లు బుర్ర సుధారాణి భూమయ్య,సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్,పుట్టాపాక సత్యం, పొన్నం స్వామిగౌడ్, మైదాం తిరుపతి, బోనాల రత్నయ్య,ఎన్ లక్ష్మి కాంతం,బోనాల రాజు,శ్రీనివాస్,తిరుపతి ,యూత్ సభ్యులు శివ దీక్ష స్వాములు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో దొంగతనం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పరిధిలోని గుంజపడుగు గ్రామంలో ఉదయం తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన చుక్క మమత ఇంట్లో దొంగతనం జరిగింది.చుక్క మమత కుటుంబ సభ్యులు సోమవారం ఇంటి నుండి ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసి తాళం చెవిని ప్యాంట్ జేబులో వేసి పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయానికి దర్శనానికి వెళ్లారు .ఆ సమయంలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి బయట ఉన్న ప్యాంట్ జేబులో ఉన్న ఇంటి తాళం చెవిని తీసుకొని ఇంటి తలుపులు తెరిచి స్క్రూల్ డ్రైవర్ సహాయంతో ఇంట్లో ఉన్న బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న నాలుగున్నర తులాల బంగారాన్ని దోచుకెళ్లారు.దర్శనం అనంతరం వచ్చి ఇంట్లో పరిస్థితిని గమనించి వెంటనే చుక్క మమత పోలీసులకు ఫిర్యాదు చేయగా దొంగతనం జరిగిన ప్రదేశాన్ని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో ఉన్న శివాలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారలకు అభిషేకాలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి వాణి నగర్ ధర్మశాల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన చైర్ పర్సన్‌ను ఆలయ నిర్వాహకులు షాలువాలతో సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, కౌన్సిలర్ బొలుసాని శ్రీనివాస్, నాయకులు గట్టు సతీష్, కొలుగూరి దామోదర్ రావు ఉన్నారు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న దుద్దిల్ల శ్రీను బాబు

**ప్రజాపక్షం/మంథని :** మంథని మండలం లోని కన్నాల గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయమును సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు బాగుండాలని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని రాష్ట్రం అభివృద్ధి పథంలో ము ందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు మరియు భక్తులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా రొంటాల సుహాసిని

**ప్రజాపక్షం/హుజురాబాద్:**హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గా రొంటాల సుహాసిని (కాంగ్రెస్), వైస్ చైర్పర్సన్ గూడూరి అంజలి (కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. హుజురాబాద్ మునిసిపల్ లో 30 వార్డులు ఉండగా కాంగ్రెస్ పార్టీ 16 కౌన్సిలర్ స్థానాలను గెలుచుకుంది. మెజార్టీ సభ్యుల ఎన్నిక తో వీరిని సోమవారం ఎన్నుకున్నట్లు ప్రత్యేక ఎన్నికల అధికారి తెలిపారు.

## మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ విప్‌గా బుర్ర మల్లికార్జున్

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ 24వ వార్డ్ కౌన్సిలర్ గా గెలుపొందిన బుర్ర మల్లికార్జున్ ఆదివారం సిరిసిల్ల పురపాలక సంఘం లో ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టారు. బిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన మల్లికార్జున్ కు మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ విప్ గా నియమించారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానానికి, మున్సిపల్ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. 24వ వార్డును అభివృద్ధి పథంలో తీసుకెళ్తూ సిరిసిల్ల మున్సిపల్ ను ఉత్తమ మున్సిపల్ గ తీర్చిదిద్దడంలో భాగమవుతానన్నారు.

**26వ వార్డు కౌన్సిలర్ గా నెల్లుట్ల నరేష్**

బిఆర్ఎస్ నుండి 26వ వార్డు అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన నెల్లుట్ల నరేష్ సోమవారం సిరిసిల్ల పురపాలక సంఘ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టారు.

## రాష్ట్రస్థాయి సిఎం కప్ 2025 బేస్ బాల్ పోటీలకు విద్యార్థులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :**సుల్తానాబాద్ లో సిఎం కప్ 2025 జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీలలో గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు జె. సాత్విక, ఏ. లాస్య ప్రియ, జి. వెన్నెల ఉత్తమ ప్రతిభ చాటారు. ఈనెల 16 నుండి 20 వరకు హైదరాబాదు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దపెల్లి జిల్లా త రఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ బాధ్యులు పి. వెంకట ఉమాప తి , పెద్దపల్లిటాగ్ ఆఫ్ వార్ జిల్లాఅసోసియేషన్ ప్రెసిడెంట్ ఆలేటి సంపత్ , పెద్దపెల్లి జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రెటరీ వాసు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ఎంపిక పట్ల గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యార్థులకు అభినందన తెలిపి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్ మరియు వాయామ ఉపాధ్యాయుడు అజయ్ కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



**బంగారు పతకాలు సాధించిన గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు :**శనివారం రోజున సుల్తానాబాద్ నిర్వహించిన సిఎం కప్ 2025 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో కే తనీష్ జావా లెంత్రో బంగారు పతకం, ఏ సాయిచరణ్ 100 మెట్ల రన్నింగ్ లో బంగారు పథకాలు సాధించినట్లు గాయత్రి కళాశాల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

## చొప్పదండి మున్సిపల్ చైర్మన్‌గా వడ్లూరి సరిత

**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి మున్సిపల్ చైర్మన్‌గా వడ్లూరి సరిత, వైస్ చైర్మన్‌గా పెరుమాండ్ల మానస ఎన్నికయ్యారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగా కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ టి.మనోహర్ ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారి జగదీశ్వర్ సమక్షంలో ఉదయం14 మంది వార్డు కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం అక్షర క్రమంలో నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో భాగంగా చైర్పర్సన్ ఎన్నిక కొరకు 1వ వార్డు సభ్యురాలు వడ్లూరి సరిత, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం 14వ వార్డు సభ్యురాలైన పెరుమాండ్ల మానస అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి విప్ జారీ చేశారు. ఎనిమిదో వార్డు సభ్యుడు రాజన్నల రాజు, వైస్ చైర్మన్ అభ్యర్థిగా నిలువగా వారికి బిజెపికి చెందిన ముగ్గురు సభ్యులు మాత్రమే మద్దతు లభించింది. సిఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ మేనేజర్ డి.ప్రశాంత్ కుమార్, ఏఈ డి.నరేష్, టిపిఓ ఎం. తిరుపతమ్మ, సీనియర్ అకౌంటెంట్ , డిప్యూటీ ఎంఆర్వో మన్‌ప్రీత్ సింగ్, ఎంపివో రాజగోపాల్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభ

**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామంలో నెలకొన్న సమస్యలను పారిష్కరించేందుకే గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బియ్యని శివకుమార్ అన్నారు.సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ బియ్యని శివకుమార్ అధ్వర్యంలో ఈ సభలో గ్రామ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సర్పంచ్ బియ్యని శివకుమార్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పరిశుభ్ర గ్రామమే లక్ష్యం'గా ప్రతి ఒక్కరూ సహకరించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని కోరారు.గ్రామస్తులు అడిగిన పలు సమస్యలను సావధానంగా విన్న సర్పంచ్, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని సభలో వెల్లడించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బియ్యని శివకుమార్ మాట్లాడుతూగ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. అందరి సహకారంతో మైదా బండను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం. అభివృద్ధి పనుల విషయంలో ఎటువంటి రాజీ పడబోంఅని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు,గ్రామ పెద్దలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా మొలుగు ప్రశాంత్

వైస్ చైర్మన్ గా ముంతాజ్ అలీ ఎడి మహమ్మద్

**ప్రజాపక్షం/జమ్మికుంట:**జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ ల సోమవారం ఎన్నిక జరిగింది. చివరి నిమిషం లో అనూహ్య రీతిలో బిఆర్ఎస్ పార్టీ పన్నెండు మంది అభ్యర్థులు, ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులతో కలిసి వచ్చిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అందరికీ షాక్ ఇచ్చారు. ఇండిపెండెంట్ అభ్యర్థి మొలుగు ప్రశాంత్ కుమార్ చైర్మన్ గా, బిఆర్ఎస్ అభ్యర్థి ముంతాజ్ అలీ ఎడి మహమ్మద్ వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ముప్పై వార్డులుండగా పన్నెండు బిఆర్ఎస్, పది కాంగ్రెస్, నలుగురు బిజెపి, ముగ్గురు ఇండిపెండెంట్ లు, ఒక్కరు అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు గెలుపొందారు. సోమవారం చివరి నిమిషం లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తో కలిసి బిఆర్ఎస్, ఇండిపెండెంట్ లు మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. పదిమంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సైతం హాజరయ్యారు. బిజెపి పార్టీకి చెందిన నలుగురు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుండి గెలుపొందిన కౌన్సిలర్ అభ్యర్థి చైర్మన్ ఎన్నికకు గైహాజరయ్యారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఇండిపెండెంట్ లతో హుజురాబాద్ ఆర్డిఓ రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ తరుణంలో ఇండిపెండెంట్ అభ్యర్థి మొలుగు ప్రశాంత్ కుమార్ బిఆర్ఎస్ కండువా కప్పుకొని ప్రమాణ స్వీకారం చేయడం పై కాంగ్రెస్ అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ముగ్గురు ఇండిపెండెంట్ లు ఒక మహిళ బిఆర్ఎస్ అభ్యర్థి నీ తమ వైపు తీసుకెళ్ళే ప్రయత్నం చేయడం తో ఇరు పార్టీల కౌన్సిలర్ అభ్యర్థుల మధ్య తోపులాట జరిగింది.చివరికి ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రశాంత్ కుమార్ కు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తరపున మద్దతు తెలుపడంతో కండువా లేకుండా ప్రమాణ స్వీకారం చేయడం తో చివరికి చైర్మన్ గా మొలుగు ప్రశాంత్ కుమార్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన వైస్ చైర్మన్ గా ముంతాజ్ అలీ ఎడి మహమ్మద్ ఎన్నికయ్యారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ఉత్కంఠ భరితంగా ఉండడంతో హుజురాబాద్ ఏసిపి మాధవి ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## కల్యాణం,అన్నదానం ,రథోత్సవం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మహాశివరాత్రి ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ కనక సోమేశ్వర కొండపై ఆదివారం చేపట్టిన మహాశివరాత్రి వేడుకలలో భాగంగా స్వామివారి కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే పెద్ద సంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అర్ధరాత్రి వేళ ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారికి అత్యంత పవిత్రమైన ఏకబిల్వాన్ని స్వామివారికి సమర్పించారు. సోమవారం వేకు కొండకింద ఆలయంలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకుని మహాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రాత్రి న రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగ జరిపించగా వేలాది సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించిపోయారు. రథోత్సవేళ ఆలయ ప్రాంగణమంతా శివన్నామ స్మరణతో మార్మోగింది. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు సౌకర్యాలను ఏర్పాటు చేసి అందుబాటులో ఉండి సేవలను అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉప సర్పంచ్ గడ్డం సోమారెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ ఇల్లెందుల తుకారాం, కమిటీ సభ్యులు సుంకేట జీవన్ రెడ్డి, తిరుపతి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు,శివదీక్ష స్వాములు భక్తులు తదితరులు ఉన్నారు.

## సౌకర్యాలు ఉన్న ఇబ్బందులు

**ప్రజాపక్షం /మల్లాపూర్:** మండల కేంద్రంలోని శ్రీ కనక సోమేశ్వర జాతర ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో సౌకర్యాలు ఏర్పాటు చేసినప్పటికీ సోమవారం కొద్దిపాటి ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఉదయం పూట ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన భక్తులు తిరిగి వెళ్లే క్రమంలో పోలీసులు ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ సమీపంలో వాహనాలు ఎక్కడిక క్కడే ఎండలో నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. చంటి పిల్లలతో సుమారు 20 నిమిషాలకు పైగా ఎండలోనే ఉండిపోవడంతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి కాగా అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు టెంట్ కింది ఉండి పట్టించుకోకపోవడంతో భక్తులు వారి పనితీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. భక్తులు పెద్ద మొత్తంలో రావడం వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపి ఉండడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది.

## బిజెపి జిల్లా అధ్యక్షుడి ఇంటిపై కార్యకర్తల దాడి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఇటీవలే జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బిజెపి పార్టీ సభ్యులు అత్యధికంగా వార్డులను గెలిచి మెట్పల్లి మున్సిపల్‌చైర్మన్ పదవిని బిజెపి కైవసం చేసుకుంటుందనుకున్నా గెలిచిన కౌన్సిలర్ల , పార్టీ కార్యకర్తల ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి. వివరాల్లోకి వెళ్తే మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బిజెపి పార్టీ కార్యకర్తలు ఆయన ఇంటిపై సోమవారం దాడి చేశారు. అత్యధికంగా 10 వార్డులు గెలుచుకొని మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవలసి ఉండగా జిల్లా అధ్యక్షుడు ఆలస్యంగా విప్ జారీ చేయడంతోనే బిజెపి పార్టీ నుండి గెలిచిన కౌన్సిలర్ మీనా కాంగ్రెస్కు ఓటేశారని, ప్రధాన కారణం జిల్లా అధ్యక్షుడి నిర్లక్ష్యమే అంటూ ఇంటి పై దాడి చేసి ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. ఒక్కసారిగా అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు జిల్లా అధ్యక్షుడు పై దాడి చేయడం ఉత్కంఠను రేపింది.

## రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన రైతు ఆవేదన

**ప్రజాపక్షం/ముత్తారం :** నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భాగంగా భూమి కోల్పోయిన రైతు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామానికి చెందిన గొర్రె మహేష్ తండ్రి స్వామి అనే రైతు తన ఆవేదన వ్యక్తం చేశారు.నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా లక్కారం గ్రామ శివారులోని సర్వే నెం. 408లో తన సొంత భూమిని రోడ్డు విస్తరణ కోసం స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.ఆ భూమిలో రెండు కిలోమీటర్ల మేర సాగు పైప్‌లైన్లు, బోర్లు ఉన్నాయని పేర్కొన్నారు.భూమికి నష్టపరిహారం చెల్లించినప్పటికీ పైప్‌లైన్లకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి పరిహారం అందలేదని ఆరోపించారు. పలుమార్లు అధికారులను సంప్రదించినప్పటికీ కేవలం నామమాత్రంగా పరిశీలనలు మాత్రమే చేస్తున్నారని వాపోయారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతు కోరారు.

## ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నాం:సర్పంచ్

ప్రజాపక్షం/చొప్పదండి:పట్టణ ప్రజలు బిఆర్ ఎస్ పార్టీకి ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని రేవెల్లి గ్రామ సర్పంచ్ బందారపు అజయ్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ ఏడవ వార్డు కౌన్సిలర్ కొత్త సుమలత గంగారెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, ప్రతి పథకం ప్రజలకు అందే వరకు నిరంతరం పోరాటం ఆపేది లేదన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, రాగంపేట సర్పంచ్ మామిడి రాజేశం, నాయకులు లోక రాజేశ్వర్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ ఎండి అజ్జు, పురం నితీష్, తదితరులున్నారు.

వార్తకు ఫోటో ఉంది

## భూదానం చేసిన గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

ప్రజాపక్షం/చొప్పదండి:మండలంలోని కొలిమికుంట గ్రామంలో గౌడ సంఘం కమ్యూనిటీ హాలు కోసం గ్రామానికి చెందిన గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తన స్వంత భూమిని దానం చేశారు. తన తల్లి కీ.శే. తాళ్లపల్లి జనానమ్మ పేరున వారి స్వంత భూమి 180 చదరపు గజాల కమర్షియల్ ప్లాటును గతంలో మాట ఇచ్చిన ప్రకారం కొలతలు కొలిసి కొలిమికుంట గౌడ సంఘం కుల సభ్యులకు సోమవారం దానంగా అప్పగించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం పెద్దలు, సభ్యులు తాళ్ల పల్లి వెంకటయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్‌ను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## గుడికోటలో రథోత్సవం



ప్రజాపక్షం /రాయికల్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆఖరి ఘట్టమైన శివపార్వతుల రథోత్సవం కనుల పండుగ సాగింది. ఆదివారం ఆలయ కమిటీ మరియు ప్రధాన అర్చకులు మంగోలి సతీష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు మునుగోటి రమేష్ శర్మ శివ పార్వతుల కళ్యాణం, అభిషేకం మరియు స్వామివారికి బిల్వార్చన తో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రోజున స్వామి వారి దర్శనం,రథోత్సవం డప్పు చప్పుళ్లు మరియు మంగళవారం వాయిద్యాలు మధ్యన కన్నుల పండుగ సాగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మంతెన మహేందర్, కోశాధికారి సాంబారు శ్రీనివాస్ లతోపాటు ఆలయ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు,నాయకులు భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డిని ఒంటరిగా చేయడమే సంజయ్ కుమార్ లక్ష్యం

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



ప్రజాపక్షం/జగిత్యాల :కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల హక్కులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాలరాస్తున్నారని ఇక కాంగ్రెస్ పార్టీలో కొనసాగడం చాలా కష్టంగా ఉందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి తన ఆవేదనను వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక విషయంలో కాంగ్రెస్ పార్టీ పీఠాన్ని దక్కించుకుందని సంతోషపడాలో నిన్న మొన్నటి దాకా బీఆర్ఎస్‌లో ఉండి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ టికెట్ పొంది చైర్ పర్సన్ అయినందుకు బాధ పడాలో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో జెండా మోసిన వారికి పదవులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రతిపాదించిన వలసవాదులకు అవకాశాలు ఇవ్వడం అధిష్టానానికి తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యతతోనే ఎన్నో అవమానాలకు, తీవ్ర మనోవేదనకు గురైనా పార్టీలోనే కొనసాగుతున్నానని కండువా వీడాలంటే బాధగా ఉందన్నారు. జగిత్యాల వ్యవహారం చూస్తుంటే సంజయ్ కుమార్‌కు నియోజకవర్గాన్ని పట్టా రాసినట్లు కనబడుతుందన్నారు. జగిత్యాలలో జీవన్ రెడ్డి ఒంటరిగా చేయడమే సంజయ్ కుమార్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు కాంగ్రెస్‌కే ఓటు వేస్తామని తెలిపినప్పటికి క్యాంపుకు తీసుకవెళ్లడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, కొత్త మోహన్, కల్లెపెల్లి దుర్గయ్య, శ్రీరాముల గంగాధర్, బారి, రమేష్ బాబు, మహిపాల్, రాజు, రజనీ కాంత్ తదితరులు ఉన్నారు.

## ధర్మపురిలో కొలువుదీరిన నూతన పాలకవర్గం

మున్సిపల్ చైర్ పర్సన్‌గా వేముల నాగలక్ష్మి





ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక సంఘం నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది.బల్దియా అధ్యక్షురాలిగా వేముల నాగలక్ష్మి,వైస్ చైర్మన్ గా ఇందారపు రామయ్యలు ఎన్నిక య్యారు.మున్సిపల్ కార్యాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేయగా ఎన్నికల ప్రత్యేక అధికారి,జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్,కమిషనర్ మామిళ్ల శ్రీనివాసరావు ల సమక్షంలో మొదట సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం చైర్ పర్సన్ గా వేముల నాగలక్ష్మి ని ప్రతిపాదిస్తూ 15వ వార్డు సభ్యులు వొజ్జల లక్ష్మణ్ ప్రతిపాదించగా ఒకటవ వార్డు సభ్యుడు అయ్యోరి వేణుగోపాల్ బలపరిచారు.అదేవిధంగా వైస్ చైర్మన్ స్థానానికి 3వ వార్డు కౌన్సిలర్ ఇందారపు రామయ్యను 4వ వార్డు సభ్యుడు కొమురెల్లి పవన్ కుమార్ ప్రతిపాదించగా ఏడవ వార్డు సభ్యులు వాంకుడోత్ విజయ్ బాబు బలపరిచారు.కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముందే విప్ జారీచేయడంతో ప్రమాణ స్వీకారం కార్యక్రమం సాఫీగా సాగింది. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కార్యక్రమానికి హాజరయ్యారు. 15 వార్డులున్న ధర్మపురి బల్దియాలో మొత్తం సీట్లను కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందగా చైర్ పర్సన్ స్థానానికి 3 వార్డు సభ్యురాలు సంగనబట్ల సంతోష,5 వార్డు సభ్యురాలు వేముల నాగలక్ష్మి లు పోటీపడ్డారు.అధిష్టానం నిర్ణయం మేరకు వీరిలో మొదటి రెండేళ్లు వేముల నాగలక్ష్మి , తర్వాత మూడు సంవత్సరాలు సంతోషి చైర్ పర్సన్ గా కొనసాగనున్నట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.మున్సిపల్ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసాకే విజయోత్సవాలు జరుపుకోవాలని మంత్రి ఎన్నికైన పాలకవర్గానికి స్పష్టం చేశారు.ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు గురక మహేష్,పులిచెర్ల ఉదయ్ కుమార్,సతీష్ లు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావుల ఎన్నిక

ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ గా రెండవ డివిజన్ నుంచి కార్పొరేటర్ గా గెలిచిన కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ గా మాజీ మేయర్ సునీల్ రావు లు ఎన్నికయ్యారు. సోమవారం కార్పోరేటర్ల ప్రమాణ స్వీకారం, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. కార్పోరేషన్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, అబ్జర్వర్లు జితేందర్ రెడ్డి, మనోహర్ సమక్షంలో మొదటగా పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తెలుగు అక్షర మాల ఆర్డర్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, ఇండిపెండెంట్, ఫార్వర్డ్ బ్లాక్ కు చెందిన 66 మంది సభ్యుల తో ఆథరైజ్డ్ ఆఫీసర్ ఆర్డీవో మహేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం మహోత్సవం, మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎక్స్ అఫిషియో మెంబర్ గా హాజరై తమ ఓటును వినియోగించుకున్నారు. భారతీయ జనతా పార్టీ నుండి మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా యాదగిరి సునీల్ రావు బీ ఫాం సమర్పించి బరిలో ఉండగా కాంగ్రెస్ పార్టీ నుండి మేయర్ అభ్యర్థిగా ఆకుల నర్మద, డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా హీనా అఫ్రీన్ బరిలో నిలిచారు. మొదటగా కాంగ్రెస్ పార్టీ నుండి మేయర్ అభ్యర్థి ఆకుల నర్మదను కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అంజన్ కుమార్ వైద్యుల ప్రతిపాదించగా గుమ్మడి రాజ్ కుమార్ బలపరిచారు. ఓటింగ్ ప్రక్రిలో కాంగ్రెస్ పార్టీ చెందిన 14 సభ్యులు, 3ఇండిపెండెంట్ సభ్యులు, 3 ఎంఐఎం సభ్యులు 1 ఫార్వర్డ్ బ్లాక్ సభ్యులు ప్లకార్డులు ఎత్తి ఓటును వినియోగించకోగా మొత్తం 21 సభ్యుల మద్దతు లభించింది. 30 మంది బిజెపి పార్టీ సభ్యులు, 3 స్వతంత్రులు, 1 ఎక్స్ అఫీషియో మెంబర్ ప్లకార్డులు ఎత్తి ఓటు వినియోగించుకోగా, 34 ఓట్ల మద్దతు లభించింది. ఇందులో 30 బిజెపి, 3 స్వతంత్రులు, 1 ఎక్స్ అఫీషియో మెంబర్ ఓటు వినియోగించుకోగా 34 ఓట్ల మద్దతు లభించింది. 14 కాంగ్రెస్ పార్టీ సభ్యులు, 3 ఇండిపెండెంట్, 3 ఎంఐఎం, 2 ఫార్వర్డ్ బ్లాక్ సభ్యులు ప్లేకార్డులు ప్రదర్శించి ఓటు వేయగా, 22 మంది సభ్యుల మద్దతు లభించింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎక్స్ అఫీషియో మెంబర్లు తమ ఓటుకు దూరంగా ఉన్నారు. దీంతో మెజారిటీ ఓట్లు బిజెపి పార్టీ అభ్యర్థులకు లభించగా, అథారిటీ ఆఫీసర్ మహేశ్వర్ మేయర్ గా కొలగాని శ్రీనివాస్ ను, డిప్యూటీ మేయర్ గా యాదగిరి సునీల్ రావు ను ప్రకటించారు. మొత్తం 66 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయగా మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నికల లో 9 మంది బిఆర్ ఎస్ పార్టీ సభ్యులు, ఎన్నికల్లో ఓటుకు దూరంగా ఉన్నారు.ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశ మందిరంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ తో పాటు పాలకవర్గ సభ్యులందరికి ధన్యవాదాలు తెలిపారు.

## పారమిత హెరిటేజ్‌లో జాతీయ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/కొత్తపల్లి:కరీంనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌లో జాతీయ ఆవిష్కరణ దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో విద్యాశాఖ(భారత ప్రభుత్వం) మార్గదర్శకత్వంలో ఏర్పాటు చేసిన స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎస్ఐసి) ఆధ్వర్యంలో నిర్వహించారు. స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ స్థాపన యొక్క ప్రధాన లక్ష్యం విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, డిజైన్ థింకింగ్, ఆవిష్కరణ, ఐడియేషన్, వ్యాపార దృక్పథాన్ని పెంపొందించడమని తెలియజేశారు. స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ లలిత్ మోహన్ సాహు మాట్లాడుతూ విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఆవిష్కరణ సంస్కృతిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించబడిందని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ తయారీ, కొటేషన్ రచన, క్విజ్ పోటీలు, ప్రోటోటైప్ తయారీ వంటి అనేక పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వాస్తవ జీవన సమస్యలకు కొత్త పరిష్కారాలను కనుగొనే దిశగా సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు అభినందించి సత్కరించారు. పారమిత విద్యార్థులు తమ ఆవిష్కరణలతో జాతీయ, అంతర్జాతీయ సైన్స్ ప్రదర్శనల్లో పాల్గొని పాఠశాలకు గౌరవాన్ని తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు రబీంద్ర పాత్రో, భవాని, నికిత, సుప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు పాఠశాల తీసుకున్న ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు.

## మున్సిపల్ పై ఎగిరిన గులాబీ జెండా

చైర్పర్సన్ గా కట్కం రవిందర్, వైస్ చైర్ పర్సన్ తురగ సౌజన్య - శ్రీధర్





ప్రజాపక్షం/రాయికల్ : రాయికల్ మున్సిపాలిటీలో చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో అనే ఉత్కంఠ కు సోమవారం తెర పడింది. రాయికల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ ,ఇండిపెండెంట్ కౌన్సిలర్ల మద్దతు తో బి ఆర్ ఎస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. దీనిలో చైర్ పర్సన్ కట్కం రవీందర్, వైస్ చైర్ పర్సన్ గా తురగ సౌజన్య శ్రీధర్ లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రవీందర్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను చైర్ పర్సన్ చేసినందుకు మన రాయికల్ ను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ప్రత్యేక మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని. నేను సేవ చేయడానికి రాజకీయంలోకి వచ్చాను కానీ ఇందులో ఎలాంటి ఉద్దేశం లేదని అన్నారు.అందరి సహాయ సహకారాలు నాకు ఎల్లవేళలా ఉండాలని కోరాడు. ఐదు సంవత్సరాలు రాయికల్ ను అభివృద్ధి పథంలో నడిపించడానికి నా శక్తి ఉన్నంతవరకు కృషి చేస్తానని తెలిపారు. వైస్ చైర్మన్ తురగ సౌజన్య మాట్లాడుతూ 12 కౌన్సిలర్లలో నేను నాలుగో వార్డ్ కౌన్సిలర్ అని అందులో నాకు 702 ఓట్లు వచ్చాయని నాకు భారీ మెజారిటీ వచ్చిందని నా భర్త అయిన తురగ శ్రీధర్ గత ఐదు సంవత్సరాలు నా వార్డు ప్రజలకు చేసిన సేవ మరియు వార్డు అభివృద్ధియే ఈ మెజారిటీకి కారణమని అన్నారు. మాపై నమ్మకం ఉంచి వైస్ చైర్ పర్సన్ గా నియమించినందుకు చైర్మన్ మరియు కౌన్సిలర్లతో కలిసి రాయికల్ మున్సిపాలిటీని అభివృద్ధి లో నడిపించడంలో నా వంతు కృషి చేస్తానని తెలిపారు.

## మెజారిటీ ఉన్న పీఠం దక్కించుకోలేని బిజెపి

ప్రజాపక్షం/రాయికల్ : రాయికల్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఐదు వార్డులు బిజెపి కైవసం చేసుకుంది. అయినా కూడా మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడంలో విఫలమైంది. మున్సిపల్ చైర్మన్ పీఠానికి ఇద్దరు కౌన్సిలర్లను మద్దతు తో బిజెపి పీఠం దక్కించుకొని పరిపాలన సాగిస్తుందని అందరూ ఊహించుకున్నారు. కానీ కౌన్సిలర్ల మద్దతు లేకపోవడంతో పీఠాన్ని దక్కించుకోక పోవడం గమనార్హం. దీంతో బిజెపి కార్యకర్తలు మరియు నాయకులకు నిరాశే మిగిలింది.

## ఈ నెల 19 న కొండగట్టు అంజన్న హుండీ లెక్కింపు

ప్రజా పక్షం/మల్యాల :జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ముత్యం పేట ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల లో భక్తులు వేసిన కానుకలను ఈ నెల 19 గురువారం విప్పి లెక్కించడానికి నిర్ణయించినట్లు ఆలయ ఈవో శ్రీకాంత రావు ఒక ప్రకటనలో తెలిపారు.

## మున్సిపల్ విజయోత్సవ ర్యాలీలో దుద్దిళ్ల శ్రీను బాబు

**ప్రజాపక్షం/మంథని :** మంథని పట్టణంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్ల పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు అనంతరం నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.ర్యాలీలో భాగంగా స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ శ్రీపాద రావు విగ్రహానికి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు మంథని అభివృద్ధి పథంలో తీసుకెళ్తారని నమ్మకంతో ప్రజలు నమ్మి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం జరిగిందనీ ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు.ఈ విజయానికి అహర్నిశలు కృషి చేసిన నాయకులకు,ప్రతి కార్యకర్తలకు,మంథని మున్సిపల్ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మంథని మున్సిపల్ చైర్మెన్‌గా వోడ్నాల శ్రీనివాస్

**ప్రజాపక్షం/మంథని :**సోమవారం మంథని మున్సిపల్ కార్యాలయములో 2వ సాధారణ ఎన్నికలు, 2026 లలో ఎన్నికైన గౌరవ సభ్యులు శ్రీ కాసబోయిన సురేష్ ,ప్రోసిడింగ్ ఆఫీసర్ & రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ సమక్షములో ప్రమాణ స్వీకారం చేయించారు.తదుపరి చైర్ పర్సన్ మరియు వైస్ చైర్ పర్సన్ ఎన్నికలు నిర్వహించగా శ్రీ వోడ్నాల శ్రీనివాస్‌ని మద్దికట్ల స్రవంతి ప్రతిపాదించగా మారుపాక నిహారిక బల పర్చగా చైర్ పర్సన్ గా శ్రీ వోడ్నాల శ్రీనివాస్ ను ఎన్నుకోవడం జరిగింది.అలాగే శ్రీ వైస్ చైర్ పర్సన్ గా శ్రీ సహేందర్ రెడ్డి ముస్కులని శ్రీ కుర్ర లింగయ్య ప్రతిపాదించగా శ్రీ పెంటరి రాజేందర్ బల పర్చగా వైస్ చైర్ పర్సన్ గా శ్రీ సహేందర్ రెడ్డి ముస్కుల ని ఎన్నుకున్నారు.

## నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**ప్రజాపక్షం / మందమర్రి :**మందమర్రిలోని సిఇఆర్ క్లబ్‌లో ఈ నెల 17న మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరగనుంది. హైదరాబాద్‌కు చెందిన మాతా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రోగులను పరీక్షించనున్నారు. వివిధ దీర్ఘకాలిక వ్యాధులు, జీర్ణ సమస్యలు, మధుమేహం, రక్తపోటు, సంధివాతం, చర్మవ్యాధులు, స్త్రీ, పురుష సంబంధిత సమస్యలతో బాధపడే వారికి ఆయుర్వేద విధానంలో పరీక్షలు నిర్వహించి చికిత్సా సూచనలు అందిస్తారు. గతంలో వైద్య సేవలు పొందిన వారు, కొత్తగా చికిత్స పొందాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ప్రకృతి సిద్ధమైన ఆయుర్వేద చికిత్సల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఎల్లంపల్లి రహదారిపై రోడ్డు ప్రమాదం

### క్షతగాత్రుడి చికిత్సకు రూ. లక్ష సాయం చేసిన మక్కన్ సింగ్ సేవా సమితి



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ గ్రామానికి చెందిన నాంపల్లి రాజన్న రెండు రోజుల క్రితం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆనకట్ట రహదారి వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. రాజన్న బైక్ పై ఎల్లంపల్లి నుంచి మంచిర్యాలకు వెళుతుండగా ఎదురుగా మరో బైక్ పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజన్న తలకు తీవ్ర గాయం కాగా, కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఆయన పరిస్థితి విషమంగా ఉంది. కోమాలోకి వెళ్ళాడు. వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ సభ్యులు బాధపడుతున్న విషయం తెలియడంతో మక్కన్ సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో గోలివాడ గ్రామానికి చెందిన యువకులు లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. తమ మిత్ర బృందం అందజేసిన ఈ డబ్బును సోమవారం రాజన్న కుమారుడు ప్రవీణ్ కు అందజేసినట్లు యూత్ కాంగ్రెస్ మండల నాయకులు సంకరి అనిల్ యాదవ్, మల్లెంపల్లి శ్రావణ్ కుమార్, మల్లెంపల్లి సందీప్, శ్రీమాన్, చరణ్ లు తెలిపారు. కాగా, రాజన్న వైద్య చికిత్స కోసం రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని, ఈ క్రింది రాజన్న కుటుంబసభ్యులఫోన్ నెంబర్ 8374392532(కేశవ్), 95 73 54 1 254(ప్రవీణ్)లకు ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని సంకరి అనిల్ యాదవ్ కోరుతున్నారు.

## భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ ప్రారంభం

**ప్రజాపక్షం / రెబ్బెన :**రెబ్బెన మండలంలోని గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రథమ చికిత్స, హైక్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ భాస్కర్ రెడ్డి పారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్కౌట్ పతాకాన్ని ఎగురవేసి విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. జిఎం మాట్లాడుతూ సమాజ సేవలో, అత్యవసర పరిస్థితుల్లో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ అందించే సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, స్వయం కృషి, శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించుకోవడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రథమ చికిత్స చేయడం తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు అందించే సాయం, కొత్త ప్రదేశాల్లో చాకచక్యంగా ప్రయాణించడం వంటి అంశాలపై ఈ మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, డిజిఎం సివిల్ ఎస్‌కె మదీనా భాషా, సీనియర్ పిఓ ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్, వివిధ సింగరేణి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## యువతలో క్రీడా స్ఫూర్తి నింపుతున్న సిఎం కప్ పోటీలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పెద్దపల్లి జిల్లా స్థాయిలో కబడ్డీ,ఖోఖో, వాలీబాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి జిల్లా డీవైఎస్ఓ అక్కపాక సురేష్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, పేట రాష్ట్ర బాధ్యులు శోభారాణి, జిల్లా పేట అధ్యక్ష కార్యదర్శులు సురేందర్, దాసరి రమేష్ పాల్గొని పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు విద్యార్థులు, యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు నిర్వహించబడుతున్నాయని, ఈ పోటీల ద్వారా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయడం లక్ష్యంగా సాగుతున్నాయని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని యువతను ప్రోత్సహించడమే సీఎం కప్ ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు.క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఇలాంటి పోటీలు భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒలంపిక్ ఈసీ మెంబర్ సిలివేరి మహేందర్, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మ ణ్, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కర్ణాకర్,మండల ఎస్ జి ఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీవాణి, సరోజ, స్వరూప,సంధ్య,వెంకటేష్,విష్ణు,జావిద్,మాధవి,వెంకటేష్,అజయ్, కుమార్,రాజేందర్,ఇక్బాల్,అజ్జు,గెల్లు మధుకర్,సత్యం,విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్గాంలో సేవాలాల్ 287వ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/అంతర్గాం :** బంజారా సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు శ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ అని, ఆయన ఆశయాలు మనందరికీ ఆదర్శనీయమనిపెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి.టి.ఎస్.అంతర్గాంలో సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు సర్పంచి ఆంగోత్ రవి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి మాట్లాడుతూ హిందు ధర్మానికి, బంజారా సమాజ అభివృద్ధి కోసం జన్మించిన మహానుభావుడు, బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ అని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడుస్తూ అందరూ భక్తిని ప్రదర్శించాలన్నారు. సద్గురు శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజనుల ఆరాధ్య దైవమే కాక, వారి సంక్షేమం, అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడని, బంజారాల సమాజానికి ఆయన చేసిన సేవ దేవునితో సమానమని, ఆయన జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన మహనీయుడని తెలిపారు.అంతర్గాం తహసిల్దార్ తూము రవీందర్ పటేల్ మాట్లాడుతూ, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను మనందరం ఆదర్శంగా తీసుకోవాలని,ఆయన బోధనలను మన జీవితంలో అనుసరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆయన చూపిన మార్గాన్ని మనం పాటిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం మహిళలు వారి సాంప్రదాయాలకు అనుగుణంగా పాటలు పాడుతూ నృత్య ప్రదర్శనలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంభీరావుపేట తిరుపతి, ఎంపీఓ బైరి వేణుమాధవ్, గిర్దావర్‌సడెంక శ్రీమాన్,బామ్లా నాయక్ తండా సర్పంచి బాదావత్ అంజి నాయక్, ఆంగోత్ సూరి నాయక్, తౌరియా నాయక్, శ్రీనివాస్, లాల్ నాయక్, మోతిలాల్ నాయక్, భూక్యా శంకర్ నాయక్, ఇస్లావత్ రాజు నాయక్, సురేష్ నాయక్,వినోద్ నాయక్,రాజేష్ నాయక్,శంకర్ నాయక్ , కార్తీక్ నాయక్ , నరేష్ నాయక్,పవన్ నాయక్, అనిల్ నాయక్, వాగు నాయక్ ,రమేష్ నాయక్, టీటీఎస్ అంతర్గాం,బ్రాహ్మణపల్లి లంబాడీ తండా బంజారా యూత్,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## సిపిఐ కార్పొరేటర్‌కు ఎమ్మెల్యే అభినందనలు

**ప్రజాపక్షం/గోదావరిఖని:** రామగుండం నగరపాలక కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం 41వ డివిజన్ కార్పొరేటర్ గా గెలుపొందిన మార్కపురి సూర్య ప్రమాణ స్వీకారం చేశారు. సిపిఐ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పాల్గొని సూర్య విజయం సాధించారు. ఈ మేరకు కార్పొరేటర్ గా ప్రమాణ స్వీకారం చేసిన సూర్యను రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు. 41వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని సూర్య తెలిపారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ముత్తారం :** యాదవ సంఘం,యాదవ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ముత్తారం మండల కేంద్రంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ ముత్తారం మండల అధ్యక్షులు కాసు తిరుపతి యాదవ్,మండల యువత అధ్యక్షులు చెల్కల యుగేందర్ యాదవ్,యాదవ సంఘం నాయకులు పాల్గొని క్యాలెండర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ సంఘం ఐక్యత,సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణ లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని,విద్య,ఉపాధి సేవా కార్యక్రమాల్లో పురోగతికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మారేడుగొండ రాజన్న,బక్కతట్ల కుమార్,మండల ప్రధాన కార్యదర్శి,కేషనపల్లి ఉపసర్పంచ్ సింగనవేన సదయ్య,యాదవ సంఘం నాయకులు బక్కతట్ల కుమార్,నూనేటి కృష్ణ,తాత పోచమల్ళ్ళ,రవికుమార్,మారేడుగొండ సమ్మయ్య,టి.తిరుపతి,పెద్ద రాజమల్లు,కిరణ్,రాజశేఖర్,దేవేందర్‌లుపాల్గొనివిజయవంతం చేశారు.

## మేయర్ ఎన్నికకు పోలీసు బందోబస్తు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు.సోమవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల్లో కూడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఈ బందోబస్తులో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్,ఎస్‌ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

## అవగాహన కార్యక్రమాల్లో మీడియా ఆఫీసర్లు ముందుండాలి

**ప్రజాపక్షం / నస్పూర్ :**తెలంగాణ రాష్ట్ర హెల్త్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీలను, క్యాలెండర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత సోమవారం ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో ప్రజలకు అవగాహన కల్పించడంలో హెల్త్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్లు కీలక పాత్ర పోషించాలని కోరారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో పాటు జిల్లాలో జరిగే సమావేశాల్లో హెల్త్ ఎడ్యుకేటర్లు జిల్లా మాస్ మీడియా తరఫున క్రియాశీలకంగా పాల్గొని ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు.జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటికే పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్, ఆఫీస్ సంచాలకులు విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, సిహెచ్‌ఓలు నాందేవ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, అల్లాడి శ్రీనివాస్, పద్మ, డిపిహెచ్ఎన్ సుమన్, సురేందర్, దామోదర్ పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ మున్సిపల్ పీఠం బిఆర్ఎస్ కైవసం

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** తీవ్ర ఉత్కంఠ రేపిన ఆసిఫాబాద్ పురపాలక సంఘం చైర్మన్ పీఠాన్ని భారత రాష్ట్ర సమితి దక్కించుకుంది. మున్సిపల్ చైర్మన్ గా మెంగ్రే ఆకాశ్, వైస్ చైర్మన్ గా ఎండి అహ్మద్ ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో ఎన్నికల అధికారి లోకేశ్వరరావు, కమిషనర్ భుజంగరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. మొదటగా 20 మంది కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేశారు. ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా ఎంఎల్ఎ కోవ లక్ష్మి ఈ ఎన్నికలో పాల్గొని ఓటు వేశారు. బిఆర్ఎస్ తరఫున అత్యధికంగా 9 మంది కౌన్సిలర్లు గెలిచినప్పటికీ మ్యాజిక్ ఫిగర్ విషయంలో సందిగ్ధత నెలకొంది. అయితే ఎంఎల్ఎ కోవ లక్ష్మి



వ్యూహాత్మకంగా వ్యవహరించి చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడంలో కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ గుండా స్నేహ బిఆర్ఎస్ అభ్యర్థి మెంగ్రే ఆకాశ్ కు మద్దతు ప్రకటించారు. దీంతో ఎంఎల్ఎ ఓటుతో కలిపి బిఆర్ఎస్ బలం 11కు చేరింది. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్లాకు ఆరుగురు కౌన్సిలర్లు, నలుగురు స్వతంత్ర అభ్యర్థులు మద్దతు తెలపడంతో వారి బలం 10కి పరిమితమైంది. దీంతో మెంగ్రే ఆకాశ్ ను చైర్మన్ గా, ఎండి అహ్మద్ ను వైస్ చైర్మన్ గా ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నిక అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ లను ఎంఎల్ఎ అభినందించారు. పట్టణ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎంపికతో ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

## నేటి నుండి వార్డ్ మెంబర్లకు శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లుగా ఎన్నికైన సభ్యులకు నేటి నుంచి 21వ తేదీ వరకు శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీవో అరుణ రాణి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి ఒక వార్డు మెంబర్ శిక్షణ తరగతులకు హాజరుకావాలని ఈ యొక్క శిక్షణ తరగతులు దిలావర్‌పూర్ రైతు వేదిక లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని.ఈ యొక్క శిక్షణ ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు.

నిర్మల్

## కలెక్టర్ కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అప్పాల కావ్య, వైస్ చైర్మన్ గా బాధ్యతలు చపట్టిన అప్పల గణేష్ చక్రవర్తి సోమవారం సాయం త్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్కను అందజేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన వా రికి కలెక్టర్ వారిని శాలువా, జ్ఞాపికతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్ర త్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ. పట్టణ సర్వతోముఖాభిద్ధికి జిల్లా యంత్రాంగం సహకారం అందించాలని కోరారు. ప్రజలకు మె రుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపరితల గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గనిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు డిమాండ్ చేశారు. సోమవారం పిట్ కార్యదర్శి ఓరం జగన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఓపెన్ కాస్ట్ లోని సిహెచ్‌పి విభాగం పరిధిలోని ఎలక్ట్రికల్, మెకానికల్ సెక్షన్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెస్ట్ షెల్టర్, సామాన్ల గది, తాగు నీరు, వాష్ రూమ్ వసతులు కల్పించాలని కోరారు. గని ప్రాంగణంలో సెక్షన్లు దూరంగా ఉన్నందున ప్రతి విభాగం వద్ద మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. వెహికల్, మోటార్ మెకానిక్ విభాగాల రిపేర్ల కోసం అవసరమైన స్పేర్ పార్ట్స్ తక్షణమే సరఫరా చేయాలన్నారు. షిఫ్టులలో పనిచేసే వారికి గతంలో ఉన్నట్లుగా మూడు నెలల లోపు ఎప్పుడైనా వీక్లీ రెస్ట్ తీసు



కునే వెసులుబాటు కల్పించాలని సూచించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రాజెక్ట్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లును కలిసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రాజెక్టు అధికారి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ భీమ్ రావ్, కలవేణ శ్యామ్, స్వామి, రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, శ్రీనివాస్, చిన్నయ్య, జాన్సన్, రమేష్, అంకుస్, శంకరయ్య, తిరుపతి పాల్గొన్నారు.

## ఆదివాసీ గ్రామాల అభివృద్ధిని విస్మరించడం తగదు

### సిపిఎం నాయకుడు నైతం రాజు

**ప్రజాపక్షం/పెంచికలపేట్ :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం ఉమ్మడి బెజ్జూర్ మండల పరిధిలోని మారుమూల ఆదివాసీ గ్రామాల అభివృద్ధి పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం నాయకుడు నైతం రాజు మండిపడ్డారు. ఆదివాసులు కనీస విద్య, వైద్యం, రహదారి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులు ఆదివాసీల హక్కులను కాలరాస్తూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివాసులు సాగు చేస్తున్న భూములపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయడం వంటి చర్యలు సరికాదన్నారు. ఉమ్మడి బెజ్జూర్ మండలంలోని సోమిని, జిల్లెడా, మొర్లిగూడ, నందిగామ, గుండేపల్లి, తలయి, కమ్మర్గం, అగరగూడ తదితర గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక



వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. ఈ సమస్యలను జిల్లా అధికారులతో పాటు సిపిఎం రాష్ట్ర నాయకుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు నైతం రాజు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మారుమూల గ్రామాల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాల్సిన బాధ్యత పాలక వర్గాలపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

## శివపార్వతుల కల్యాణం..పోటెత్తిన భక్తజనం..!

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** ప్రకృతి రమణీయతకు, ఆధ్యాత్మికతకు నిలయమైన దిలావర్‌పూర్ మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీరాజరాజేశ్వర ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. సోమవారం ఆలయ పూజారి జంగం నాగనాథ్ ఆద్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా,శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఘనంగా కళ్యాణ వేడుకలు మంగళ వాయిద్యాలు,వేద మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కళ్యాణ క్రతువును పూజారి నాగనథ్ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్నప్పటికీ ఈ విశిష్ట వేడుకను వీక్షించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుండే కాకుండా పొరుగు ప్రాంతాల నుండి కూడా భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు.పచ్చని చెట్ల మధ్య వెలసిన రాజన్న లొద్ది క్షేత్రం భక్తుల రాకతో,శివపార్వతుల కళ్యాణంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.భక్తులందరూ బారులు తీరి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఆకట్టుకున్న అన్నదాన కా



ర్యక్రమం కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తుల సౌకర్యార్థం ఆలయ పూజారి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించారు.అడవి మార్గంలో శ్రమకోర్చి వచ్చిన భక్తులకు స్వామివారి ప్రసాదంగా అన్నదానం చేయడం విశేషం,కళ్యాణాన్ని వీక్షించిన భక్తులందరూ ఈ ప్రసాదాన్ని స్వీకరించి పునీతులయ్యారు.ఏటా నిర్వహించే ఈ వేడుక ఈసారి మరింత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు,గ్రామస్తులు,పెద్ద సంఖ్యలో శివ భక్తులు పాల్గొన్నారు.

## సింగరేణి రక్షణ సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించాలి




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎస్ అండ్ పిసి సిబ్బందికి రక్షణ ఆయుధాలు అందిస్తూ, మౌలిక సదుపాయాలు సమకూర్చాలని బిఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన యూనియన్ నాయకులతో కలిసి శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్, ఏరియా సెక్యూరిటీ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల రక్షణలో సెక్యూరిటీ సిబ్బందికి సహాయకరంగా పాలీ కార్బోనేట్ స్టిక్ (లాఠీ), హైపవర్ టార్చ్ లైట్లు అందించాలని కోరారు. సదుపాయాల కల్పన ద్వారా ఆస్తుల రక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని, విధుల నిర్వహణలో సిబ్బంది సామర్థ్యం పెరుగుతుందని శ్రీధర్ రెడ్డి తెలిపారు. యాజమాన్యం స్పందించి రక్షణ సిబ్బందికి యుద్ధ ప్రాతిపదికన అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ఎస్ అండ్ పిసి పిట్ కార్యదర్శి కొమ్మ బాపు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుమ్మరి చంద్రశేఖర్, కుంట రాజు, ఆకుతోట బాలకృష్ణ, అష్టకాల శ్రీధర్, ఐలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎస్‌కెజి సంఘ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌పి హేమతేజ



**ప్రజాపక్షం/పెంచికలపేట్ :** యువకులు క్రీడలతో పాటు చదువులోనూ ముందుండాలని ఎస్కెజి సంఘ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌పి హేమతేజ పిలుపునిచ్చారు. సోమవారం గొంట్లపేట్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పోషన్న, యువకులతో కలిసి ఆయన వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమతేజ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలను అలవాటు చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, జట్టు భావన వంటి విలువలు పెంపొందుతాయని తెలిపారు. యువకులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్‌కు శ్రీ క్షేత్ర చిట్‌ఫండ్ 15 వేల రూపాయలు అందించగా, ఎస్కెజి సంఘ డైరెక్టర్ ఎన్ పి హేమతేజ స్పాన్సర్‌గా నిలిచారు. అనంతరం ఎస్ఐ అనిల్ కుమార్, హేమతేజలను క్రీడాకారులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నయ్య, చేద్వాయి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, కొండపల్లి మాజీ సర్పంచ్ సంజీవ్, నాయకులు బండి వెంకటచలం, పంచాయతీ కార్యదర్శి రాకేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 18న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** నస్పూర్ లోని మనోరంజన్ సముదాయం ప్రాంగణంలో ఈనెల 18న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డిజిఎం ఎస్. అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరగనుందని బిపి, షుగర్, నడుము నొప్పి, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని అనిల్ కుమార్ వివరించారు. ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక విరామం అనంతరం తిరిగి సోమవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జడ్పీ డిప్యూటీ సీఈఓ సాయన్నలతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 34 వినతులు అందగా వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. కాగా మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆయా కార్యాలయాల పని తీరును, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలును నిశితంగా పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలనిఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, వసతిగృహాలు, రెసిడెన్సియల్ స్కూళ్లను సందర్శించి నాణ్యమైన విద్య పౌష్టికాహారమందేలా పర్యవేక్షణ జరపాలన్నారు. బాలికల విద్యాలయాలు, హాస్టళ్లలో విద్యార్థినుల భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించేలా తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. ఎక్కడ కూడా భోజనం కలుషితం కాకుండా చూడాలని, విద్యార్థులు ఆరోగ్యాల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఉద్దేశించి భవిత కేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సాటాపూర్‌లో శివరాత్రి ఉత్సవాలు



ప్రజాపక్షం/ఎడపల్లి : నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నాగేశ్వరాలయ శివ మందిర్‌లో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదంలో పాల్గొని భగవంతుని ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రహరీ నిర్మాణానికి విశేష కృషి చేసిన ఆలయ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ ని, లక్ష్మీ నర్సయ్య ని గ్రామ యువత శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరేష్, అర్జున్, చింటూ, రవి, ప్రసాద్, గణేష్, సాయిలు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ అర్బన్‌ను అభివృద్ధి చేస్తా



ప్రజాపక్షం/నిజామాబాద్ : కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్‌గా ఎన్నిక కావటం నా అదృష్టమని, అందుకు కృషి చేసిన టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని మేయర్ కూరగాయల ఉమారాణి అన్నారు. అందరి సహకారంతో మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. సామాన్య కార్యకర్తలైన నాకు ఈ అవకాశం కల్పించిన పార్టీకి రుణపడి ఉంటానన్నారు.

## శివాలయాలలో అన్నదానాలు

ప్రజాపక్షం/మోర్తాడ్ : మోర్తాడ్ మండల కేంద్రంలో అతి పురాతనమైన శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా సోమవారం వీడీసీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వీడీసీ సభ్యులు టెంట్లు వేసి మంచినీటి తదితర సౌకర్యాలు కల్పించారు.

## విద్యార్థుల సమస్యలపై ఎఐఎస్‌ఎఫ్ పోరాటాలు

మారయ్యగౌడ్



ప్రజాపక్షం/నిజామాబాద్ : విద్యార్థుల సమస్యలపై ఎఐఎస్‌ఎఫ్ అలుగెరగని పోరాటాలు చేస్తుందని ఎఐఎస్‌ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మహాసభ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు మారయ్యగౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్సెస్సార్ విద్యా సంస్థలో మహాసభల గోడప్రతులను ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు మారయ్యగౌడ్ ఆవిష్కరించి మాట్లాడారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలు 18 నుంచి 20 వరకు నిర్వహించటం సంతోషకరమన్నారు. రాష్ట్రం నలుమూలాల నుంచి 750 మంది విద్యార్థి ప్రతినిధులు పాల్గొనున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు సుధాకర్, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య, అధ్యక్ష, కార్యదర్శులు సుభోద్, రఘురాం, కుశాల్, సంజయ్, కార్తీక్,అనూష, కిషోర్, నిఖిల్, దినేష్, చందు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్‌గా పద్మావతి ప్రమాణ స్వీకారం



ప్రజాపక్షం/బోధన్ : బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ ఎన్నికలలో గెలుపొందిన కౌన్సిలర్లకు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 38మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉండగా 34మంది కౌన్సిలర్లే హాజరయ్యారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సమావేశానికి హాజరైన 34మంది కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన చైర్మన్ ఎన్నిక ఉత్కంఠభరితంగా సాగింది. అనూహ్య రాజకీయ పరిణామాల మధ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కౌన్సిలర్ తూము పద్మావతి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా ఆల్ ఇండియా ఎంఐఎం పార్టీ అభ్యర్థి కౌన్సిలర్ మీర్ ఇలియాజ్ అలీ ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్, ఎంఐఎం, స్వతంత్రులు, ఎక్స్ అఫిషియో భ్యులు మొత్తం 31మంది ఓట్ల మద్దతు తూము పద్మావతికి లభించడంతో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తూము పద్మావతిని మున్సిపల్ చైర్ ఫర్సన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు. గతంలో బీసీ మహిళ కోటాలో ఈ సారి జనరల్ కోటాలో ఉన్న చైర్మన్ పదవి ఆమెకు రెండోసారి చైర్ పర్సన్‌గా అవకాశం వరించింది. వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మీర ఇలియాజ్ అలీకి ఎంఐఎం, కాంగ్రెస్, స్వతంత్ర సభ్యుల మద్దతు లభించడంతో ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అన్ని వర్గాల సహకారంతో ముందుకు సాగుతామని చైర్ పర్సన్ తూము పద్మావతి శరత్ రెడ్డి, వైస్ చైర్మన్ ఇలియాస్ అలీ లు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాణాకలాన్‌లో కుస్తీ పోటీలు



ప్రజాపక్షం/ఎడపలి : నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని పలు గ్రామాలలో గల శివాలయాల్లో మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శివరాత్రి మరుసటి రోజు సోమవారం ఆలయ కమిటీ నిర్వహకులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని వడ్డేపల్లి, వీరభద్ర గుడి, ఆదేశ్ లింగ ఆశ్రమ, లక్ష్మీ నరసింహ స్వామి, జాన్కంపేట్ స్వయం భూ శివాలయంలో భక్తుల సౌకర్యం మేరకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎడపల్లి, ఆదేశ్ లింగం, రాణా కలాన్ శివాలయం వద్ద జాతర ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాలకి చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యం మేరకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే రాణా కలాన్ గ్రామ శివారులో గల శివాలయంలో సోమవారంతో ఉత్సవాలు ముగిశాయి. గ్రామస్తుల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి తరలివచ్చారు. కుస్తీ పోటీలో విజేతగా నిలిచిన మల్లయోదులకి గ్రామస్తుల ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందచేశారు. ఈ మేరకు శివాలయం వద్ద జాతర కొనసాగింది. ఆలయం వద్ద దుకాణ సముదాయాలు వెలిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎడపల్లి ఎస్సై రమ ఆధ్వర్యంలో పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఆకుల సురేష్, పొల్ల శ్రీనివాస్, గెంటె శ్రీనివాస్, ఉప సర్పంచ్ రవి, విఠల్ గౌడ్, పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ చక్రేశ్వరుని శోభాయాత్ర




ప్రజాపక్షం/బోధన్ : బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వరుని రథ శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభయాత్రకి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కమల, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్ పట్వారీ హాజరయ్యారు. పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్ పట్వారీ ఆలయంలోని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ చక్రేశ్వర స్వామి శోభయాత్ర రథానికి ఆలయ అర్చకులు గణేష్ మహరాజ్ మంత్రోచ్చారణల మధ్య వారు పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి శోభాయాత్ర ప్రారంభించారు. స్వామి వారి శోభాయాత్ర పట్టణంలోని పలు వీధుల గుండా నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటే నారాయణ, భక్తులు వినోద్ పట్వారీ, నవీన్, బీర్కూర్ శంకర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయం



ప్రజాపక్షం/మాక్లూర్ : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని వల్లభాపూర్ గ్రామంలోని శివాలయంలో శివరాత్రివేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పెరుమండ్ల గంగాధర్ భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. హరహర మహాదేవ శంభో శంకర నినాదాలతో ఆలయాలు మారుమోగాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. నవీపేట్ మండలంలోని జన్నెపల్లి శివాలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్నెపల్లి నూతన సర్పంచ్ ముదుపు గంగాధర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతి ఏటా ఆనవాయితీగా వచ్చే కుస్తీ పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన మల్లయోధులకు నగదును అందజేశామన్నారు. ఈ కుస్తీలు హోరాహోరీగా సాగాయన్నారు. అనంతరం భక్తులకు సోమవారం అన్నదానం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీరేందర్, చుట్టుపక్కల గ్రామాల భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## మోర్తాడ్‌లో ఘనంగా రథోత్సవం



ప్రజాపక్షం/మోర్తాడ్ : నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మహాశివరాత్రి పర్వదినం రోజున శివాలయంలో ఉదయం నుంచి భక్తులు క్యూలైన్‌లో నిలబడి మహా శివున్ని దర్శనం చేసుకున్నారు. మహా శివాలయంలో వేద పండితులు, శివపార్వతుల కల్యాణం జరిపించారు. కల్యాణంలో అనేక మంది భక్తులు పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి ఆనందంతో పరవశించిపోయారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. రథాన్ని శివాలయం నుంచి ఆదివారం మార్కెట్‌లో గల షావ గద్దె వరకు భక్తులు తాళ్లతో లాగుతూ షావ గద్దె వరకు తీసుకవచ్చారు. రథోత్సవంలో అనేక మంది గ్రామస్తులు కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా పాల్గొన్నారు. ఉదయం నుంచి పిల్లా పాపలతో వచ్చి శివాలయంలో వారు మొక్కిన మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గ్రామంలోని ప్రజలు పిల్లా పాపలలతో చల్లంగా ఉండి గ్రామంలో పాడి పంటలు సంవృద్ధిగా పండాలని సంతోషంగా జీవించాలని ఆ మహాదేవున్ని వేడుకున్నారు.

# నిజామాబాద్ మేయర్‌గా కూరగాయల ఉమారాణి

**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 49వ డివిజన్ కార్పొరేటర్ కూరగాయల ఉమారాణి నిజామాబాద్ మేయర్‌గా ఎంపికయ్యారు. సోమవారం నిజామాబాద్ కార్పొరేషన్‌లోని సమావేశ మందిరంలో నూతనంగా ఎంపికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిజామాబాద్ ఆర్‌డివో రాజేందర్, ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నూతన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 12.30 గంటలకు మేయర్ ఎన్నిక ప్రక్రియ ప్రకటించారు. రాష్ట్ర పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సీల్డ్ కవర్ ద్వారా ఉమారాణి పేరును ప్రకటించగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకటవ డివిజన్ కార్పొరేటర్ భోజన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్తిని ఉమారాణి పేరు ప్రతిపదించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు 17 మంది ఏఐఎంఐఎం చెందిన14 మంది, టిఆర్‌ఎస్ పార్టీకి చెందిన అబ్యర్థిని విజయలక్ష్మి రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తమ చేతులు ఎత్తి తమ మద్దతును ప్రకటించారు. దీంతో





కాంగ్రెస్ పార్టీకి 34 ఓట్లు రాగా భారతీయ జనతా పార్టీ అబ్యర్థులు 28 కార్పొరేటర్లు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, నిజామాబాద్ ఎంపి అర్వింద్ లతో కలిపి తమ పార్టీ అభ్యర్థిని అయిన స్రవంతిరెడ్డికి 31 ఓట్లు రాగా మూడు ఓట్ల ఆధిక్యతతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కూరగాయల ఉమారాణి ఎంపికైనట్లు అదికారులు ప్రకటించారు.

**డిప్యూటీ మేయర్ సల్మా తహసీన్ :** 54వ డివిజన్ ఏఐఎంఐఎం అభ్యర్థిని సల్మా తహసిన్ కాంగ్రెస్, టిఆర్ ఎస్, ఏఐఎంఐఎం పార్టీల మద్దతు 34 ఓట్లు రాగా భారతీయ జనతా పార్టీ డిప్యూటి మేయర్ అభ్యర్థి బంటు రాముపై మూడు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి, నిజామాబాద్ ఆర్‌డివో రాజేందర్, నిజామాబాద్ మునిసిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్, తెలంగాణ రాస్ట్ర పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యేరాకేష్ రెడ్డి, ఆయా పార్టీల కార్పొరేటర్లు, నిజామాబాద్ నగరపాలకసంస్త అదికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిశానిర్దేశం
కట్టుదిట్టమైన ఏర్పాట్లు
సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన
ప్రిసైడింగ్ అధికారులు
నగరపాలక సంస్థ మేయర్‌గా
కూరగాయల ఉమారాణి
డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎన్నిక

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలోని నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, మేయర్/డిప్యూటీ మేయర్, చైర్‌పర్సన్/వైస్‌చైర్‌పర్సన్ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నగరపాలక సంస్థ సమావేశానికి ఆర్డీఓ రాజేంద్రకుమార్, ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా బోధన్, ఆర్మూర్‌లలో సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, భీమ్‌గల్ జడ్పీ సిఇఒ సాయగౌడ్ పిఒగా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రిసైడింగ్ అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఇదే తరహాలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తూము పద్మాశరత్ రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్‌గా ఇలియాస్ అలీని, ఆర్మూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా లహరి స్వామి, వైస్‌చైర్‌పర్సన్‌గా కాటిపల్లి వెంకట్‌రెడ్డిని, భీమ్‌గల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బి.నాగమణి స్వామి, వైస్‌చైర్‌పర్సన్‌గా లతను ఎన్నుకున్నారు. మేయర్/డిప్యూటీ మేయర్, చైర్‌పర్సన్/వైస్‌చైర్‌పర్సన్ల ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పద్మావతి శరత్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ ఎన్నికలలో గెలుపొందిన కౌన్సిలర్లకు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 38మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉండగా 34మంది కౌన్సిలర్లే హాజరయ్యారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో సమావేశానికి హాజరైన 34మంది కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన ఛైర్మన ఎన్నిక ఉత్కంఠభరితంగా సాగింది. అనూహ్య రాజకీయ పరిణామాల మధ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కౌన్సిలర్ తూము పద్మావతి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్‌గా ఆల్ ఇండియా ఎంఐఎం పార్టీ అభ్యర్థి కౌన్సిలర్ మీర్ ఇలియాజ్ అలీ ఎన్నికయ్యారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్, ఎంఐఎం, స్వతంత్రులు, ఎక్స్ అఫిషియో భ్యులు మొత్తం 31మంది ఓట్ల మద్దతు తూము పద్మావతికి లభించడంతో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో తూము పద్మావతిని మున్సిపల్ ఛైర్ ఫర్సన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు. గతంలో బీసీ మహిళ కోటాలో



ఈ సారి జనరల్ కోటాలో ఉన్న ఛైర్మన్ పదవి ఆమెకు రెండోసారి ఛైర్ పర్సన్‌గా అవకాశం వరించింది. వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన మీర ఇలియాజ్ అలీకి ఎంఐఎం, కాంగ్రెస్, స్వతంత్ర సభ్యుల మద్దతు లభించడంతో ఆయన మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి పుష్పగుచ్ఛ మిచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అన్ని వర్గాల సహకారంతో ముందుకు సాగుతామని ఛైర్ పర్సన్ తూము పద్మావతి శరత్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఇలియాస్ అలీ లు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోచన్నపేటలో పర్యటించిన సర్పంచ్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట :** గ్రామాలలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం పోచన్నపేట గ్రామంలో గుడ్ మార్నింగ్ సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎండీ ఫిరోజ్ మొదటి వార్డులో పర్యటించి స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయితి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** జఫర్‌గడ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మంపేట గ్రామంలోని మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో ఉపవాస భక్తులకు ఉప సర్పంచ్ రాకేష్ సహాయంతో పండ్లు పంపిణి చేయడం జరిగింది. అదేవిధంగా తిమ్మంపేట గ్రామంలోని వీరాంజనేయస్వామి భక్తులకు, జఫర్‌గడ్ నీలకంఠ పరమేశ్వర దేవస్థానంలోని భక్తులకు కూడా పండ్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పూర్ణచందర్, ట్రెజరర్ బాలరాజు, స్టేషన్‌ఘనపూర్ ట్రెజరర్ అశోక్, రమేష్, సోమేశ్వర్, శ్రీధర్, సంతోష్, రాజు, బోనగిరి శ్రవణ్‌కుమార్, శివప్రసాద్, గ్రామ గుడి పూజారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/పాలకుర్తి :** ఇటీవల జనగామలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడలలో పాలకుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఎంఈవో పోతుగంటి నర్సయ్య, హెచ్‌ఎం శోభారాణి, పీడీ మామిండ్ల సోంమల్లు, ఉపాధ్యాయులు రమేష్, బలరాం, రవి, వెంకన్న, తల్లిదండ్రులు అబినందించారు.

## కొలువుదీరిన బిచ్కుంద మున్సిపల్ కార్యవర్గం

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** బిచ్కుంద మున్సిపల్ నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మెన్ సీమ షెట్కార్, వైస్ చైర్మెన్‌గా భాగ్యలక్ష్మీ లు పదవీ భాద్యతలు స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన చైర్మెన్, వైస్ చైర్మెన్‌లకు ఎమ్మెల్యే తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ బిచ్కుంద పట్టణ అభివృద్ధిలో నూతన పాలకవర్గం చురుకైన పాత్ర పోషించాలని, ప్రజా జసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.

## రాష్ట్రపతి నిలయంలో వైభవోపేతంగా కూచిపూడి ప్రదర్శన

**ప్రజాపక్షం/జన్నారం :** హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించిన కళ సంధ్య ప్రాంగణంలో నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు కూచిపూడి నృత్యంతో అలరించారు. జన్నారం, లక్షెట్టిపేట శాఖలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. భారతీయ సాంప్రదాయ నృత్యమైన కూచిపూడిని ఎంతో నైపుణ్యంతో, భక్తి భావంతో ఆవిష్కరించి తమ ప్రతిభను చాటారు. రాష్ట్రపతి నిలయం వంటి గౌరవనీయమైన వేదికపై ప్రదర్శన ఇవ్వడం విద్యార్థుల కృషికి లభించిన గొప్ప గుర్తింపని నర్మద ఆనందం వ్యక్తం చేశారు. డాన్స్ మాస్టర్ నర్మదా గౌడ్ మాట్లాడుతూ గురువు, శిష్యుల సమిష్టి కృషితో ఈ ప్రదర్శన కళాక్షేత్ర ప్రస్థానంలో ఒక విశిష్ట ఘట్టంగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాభిమానులు, ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామపంచాయతీలో టిఆర్‌ఎస్ పార్టీ నుండి ఏకగ్రీవంగ ఎన్నికైన నూతన సర్పంచ్ తిప్పనపల్లి లక్ష్మయ్య, లక్ష్మీపురం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొట్టే ఉమామహేశ్వరి, మరికొందరు టిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కన్నాయిగూడెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అప్సర్ పాషా, మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సర్పంచ్ జాడి రాంబాబు, ఆధ్వర్యంలో సోమవారం ములుగు డిఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్ లో మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** పచ్చదనాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కుదురుపల్లి సర్పంచ్ చల్ల సమ్మి రెడ్డి అన్నారు. సోమవారం 2026–27వ సంవత్సరానికి వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుదురుపల్లి గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకానికి కావల్సిన ఎరువులు,మట్టిని కవర్లలో నింపే కార్యక్రమాన్ని ప్రాంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పచ్చదనాన్ని కాపాడడానికి మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని అన్నారు.ఉప సర్పంచ్ అమురాజి యశోద రవి,కార్యకర్తలు నీర్ల జీవన్,గోమాస కుమార్, కూలీలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్రు కృషి చేయాలని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.ఆదివారం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆటో లడ్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీపాద స్మారక చలివేంద్రాన్ని ఆయన ప్రాంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడల తీవ్రత రోజురోజుకు పెరుగుతుందని,నిత్యం మండల ప్రజలు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటాని వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. జిల్లా గ్రందాలయ చైర్మెన్ రాజబాబు, సర్పంచ్ హసీనా బానో ,మాజీ జడ్పిటీసి చల్ల తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.